క్లుప్తంగా

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



ఫిరంగిపురం: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని వైద్యురాలు యాసీగ్రేస్ అన్నారు. మండలంలోని మునగపాడు గ్రామంలో నుదురుపాడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. 125 మంది రోగులకు వివిధ పరీక్షలు చేసి, నెలకు సరిపడా మందులు అందజేశారు. గర్భిణులు, బాలింతలు ఎనిమిది మందికి షుగర్, బీపీ, థైరాయిడ్, యూరిన్ పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ హెచ్‌పీ లింగరాజు, హెల్త్ అసిస్టెంట్ రాజశేఖర్, ఏఎన్ఎం పాపులమ్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈవీఎంల గోడౌన్ తనిఖీ



ఫిరంగిపురం: రేపూడి గ్రామ శివారులోని వ్యవసాయ మార్కెట్ యార్డు గోడౌన్‌లో భద్రపరిచిన ఈవీఎంలను ఆర్డీవో ఎం.గంగరాజు మంగళవారం తనిఖీ చేశారు. షట్టర్‌కు ఉన్న తాళాలు పరిశీలించారు. సీసీలు పనిచేస్తున్న తీరు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పోలీసుల రిజిష్టర్ హాజరు పట్టికను పరిశీలించారు. తహసీల్దార్ ప్రసాదరావు, ఆర్అండ్‌బీ ఏఈ డి.అరుణకుమారి, అగ్నిమాపక శాఖ కె.న వీన్‌సింగ్, విద్యుత్‌శాఖ వి.శ్రీరామమూర్తి, వి.శివకుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



ఫిరంగిపురం: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎంఎల్సీ అభ్యర్థిగా పోటీచేస్తున్న కెఎస్ లక్ష్మణరావు కృషి చేస్తారని పలు సంఘాల నాయకులు అన్నారు. మండల కేంద్రంలోని రామాలయంలో ఎమ్మెల్సీ అభ్యర్థిగా కె.ఎస్.లక్ష్మణరావు పోటీ చేస్తున్న సందర్భంగా ఆయన విజయాన్ని కాంక్షిస్తూ పలు సంఘాల నాయకులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. నిరంతరం సమస్యలపై పోరాడే వ్యక్తి లక్ష్మణరావు అని చెప్పారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆర్.రాజశేఖర్, సీఐటీయూ నాయకుడు మస్తాన్‌వలి, మార్పుల వెంగళరెడ్డి, పవన్, వేణు, అంబేడ్కర్ యువజన సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఆసుపత్రి నిర్మాణంలో జాప్యం చేయవద్దు

తాడేపల్లి రూరల్ : మంగళగిరి నియోజకవర్గం చినకాకానిలో 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణంపై మంత్రి నారా లోకేష్ వైద్యశాఖ వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం మంగళవారం నిర్వహించారు. నారా లోకేష్ మాట్లాడుతూ మంగళగిరిలో ఆసుపత్రికి అవసరమైన అన్ని అనుమతులు వెంటనే తీసుకురావాలని, వీలైనంత త్వరగా నిర్మించి వైద్య సేవలు అందించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ది భార్గవ్ గ్రూప్ ఎండీ ఎ.భార్గవ్, డీజీఎం కిషోర్, సీనియర్ ఇంజనీర్ అనిల్, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, వీసీ ఎండీ పి.ఎస్.గిరీష్ పాల్గొన్నారు.

వృద్ధురాలి అదృశ్యంపై ఫిర్యాదు



మంగళగిరి (తాడేపల్లి రూరల్): వృద్ధురాలి అదృశ్యంపై మంగళగిరి పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. టిడ్కో గృహాల్లో నివాసం ఉంటున్న 74 ఏళ్ల మొక్కల వెంకటరత్నం అనే వృద్ధురాలు ఈ నెల 20వ తేదీ నుంచి కనిపించడం లేదు. బంధువులు, చుట్టుపక్కల ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఆమె కుమారుడు చెన్నకేశవరావు మంగళవారం పోలీసులను ఆశ్రయించాడు. వృద్ధురాలు కనబడితే పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్ఓ 86888 31354 నంబరుకు లేదా కుటుంబ సభ్యులకు 79818 06003 సమాచారం ఇవ్వాలని పట్టణ పోలీసులు తెలిపారు.

కాల్వలో పడి యువకుడి గల్లంతు

నకరికల్లు: ప్రమాదవశాత్తు కాలువలో జారి పడిన వ్యక్తి గల్లంతయ్యాడు. మండలంలోని త్రిపురాపురం సమీపంలో మంగళవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఫిరంగిపురం గ్రామానికి చెందిన మహమ్మద్ తాజుద్దీన్(32) గుంటూరులోని ఒక హోటల్‌లో క్యాషియర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం తన ముగ్గురు స్నేహితులతో కలసి రంగురాళ్లు ఏరుకునేందుకు త్రిపురాపురం వద్దకు వచ్చారు. ఏరుకున్న రాళ్లను బెల్లంకొండ బ్రాంచ్ కెనాల్‌లో శుభ్రంచేసే క్రమంలో కాలువలో జారిపడిన మహమ్మద్‌తాజుద్దీన్ గల్లంతయ్యాడు. స్నేహితులు కాపాడేందుకు ఎంత ప్రయత్నించిన ఫలితం లేకపోయింది. స్నేహితులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు గాలింపు చర్యలు చేపడుతున్నారు.

ఎక్కడదీ వానర సైన్యం

- మంగళగిరిలో అధికమైన కోతుల బెడద
- ఇళ్లు, పంట పొలాల్లో స్వైర విహారం
- హడలెత్తి పోతున్న నివాసితులు, రైతులు

తాడేపల్లి రూరల్: ఆరుగాలం శ్రమించిన రైతన్నను పంట చివర్లో ప్రకృతి వైపరీత్యాలు కలవరపెడుతుంటే.. మూలిగే నక్కపై తాటికాయ పడిన చందంగా వానర దండు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. మంగళగిరి నియోజకవర్గంలో ఉన్న సాగు భూముల్లో పంటలను తీవ్రంగా నష్టపరుస్తున్నాయి. కొన్ని గ్రామాల్లో కోతుల దండు ఇళ్ల మీదకు వచ్చి, రోడ్లపై ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. తలుపులు తీసి ఉంటే ఇంట్లోకి వచ్చి చేతికి అందిన వస్తువులు తీసుకుని పారిపోతున్నాయి.



నివాసాల వద్ద తిరుగుతున్న కోతులు

తలుపులు తీస్తే అంతే...

ఈ మధ్య కాలంలో ఉండవల్లిలో శ్రీధర్ అనే వ్యాపారి ఇంటిలోకి కోతి వెళ్లిన సమయంలో ఫోన్ రింగకావడంతో ఆ ఫోన్ తీసుకుని వెళ్లిపోయింది. ఆ వ్యాపారి నానా తిప్పలు పడి కోతికి అరటిపళ్లు విరిసివేయగా చేతిలో ఉన్న ఫోన్ పడవేయడంతో పగిలిపోయింది. దాబాలపైన, ఇంటి ఆరుబయట బియ్యం, పప్పులు ఆరబోసిన సమయంలో కాపలా కూర్చోకపోతే ఒక్క గింజ కూడా మిగలకుండా కోతుల పాలవుతున్నాయి.

తోటలపై దాడి

ఉండవల్లి, పెనుమాక, కుంచనపల్లి, నిడమర్రు, నూతక్కి, దుగ్గిరాల చుట్టు పక్కల గ్రామాల్లో అరటి ఇతర పండ్ల తోటలు ఎక్కువగా రైతులు వేస్తున్నారు. ఆ పొలాల్లో పడిన కోతులు పంటను ధ్వంసం చేస్తున్నాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కొంతమంది రైతులు అనధికారికంగా పొలం చుట్టూ కరెంటు ఏర్పాటు చేస్తున్నారు. కోతులవల్ల తీవ్ర నష్టం వాటిల్లుతోందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేతికి అంది వచ్చిన పంట కోతుల పాలు కావడంతో రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు.

సన్నకారు రైతులకు అధిక నష్టం

చిన్న, సన్న కారు రైతులు అధికంగా సాగు చేసుకునే నేలల్లో పంటలు అంతంత మాత్రంగానే పండుతుంటాయి. ప్రస్తుతం పెసర, మినుము, వేరుశనగ సాగు చేస్తున్నారు. ఎన్నడూ లేని విధంగా కోతుల దాడి పెరిగిపోయింది. పంట చేలలో పైరును నాశనం చేయడాన్ని గమనించిన రైతులు వాటిని తరిమి కొడుతుంటే... అవి మూకుమ్మడిగా వచ్చి తిరిగి పొలాలపై దాడి చేస్తున్నాయి. వానర బాధ భరించలేక... రైతులు వేకువ జాము మొదలు పొద్దు పోయే వరకు కాపలా కాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒక గట్టున కాపలా ఉంటే... మరోవైపు కోతులు వీరంగం చేస్తున్నాయి. అదిలిస్తున్న రైతులపై దాడులు చేస్తున్నాయి. చివరికి పొలాలకు వెళ్లాలంటేనే రైతులు భయపడుతున్నారు. గుంపుగా వెళ్లాల్సి వస్తోంది. పూత, పిందె దశలోనే పంటను పూర్తిగా నాశనం చేస్తున్నాయని, అప్పులు చేసి సాగుకు ఉపక్రమిస్తే చివరికి నామ రూపాలు లేకుండా పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు రైతులు. సంబంధిత అధికారులు స్పందించి వానరాల నుండి పంటలను, ప్రజలను కాపాడాలని కోరుకుంటున్నారు.

మహిళలపై కోతుల మూక దాడి

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో మంగళవారం సాయంత్రం ఒక్కసారిగా కోతుల గుంపు ఇళ్ల మీదకు వచ్చి పలువురిని గాయపరిచాయి. మేకల సుజాత అనే మహిళపై ఒకేసారి నాలుగు కోతులు దాడి చేయడంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక యువకులు చెదరకొట్టడంతో అక్కడి నుంచి కోతులు పరారయ్యాయి. మొత్తం ఐదుగురు మహిళలపై కోతులు దాడి చేశాయని స్థానికులు తెలిపారు. పలుమార్లు కార్పొరేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని ఆరోపిస్తున్నారు. గతంలో కొండముచ్చును తిప్పడంతో కోతుల బెడద తగ్గిందని చెప్పుకొచ్చారు. ప్రస్తుతం కొండ ముచ్చును తిప్పడం ఆపివేయడంతో కోతులు మళ్లీ నివాసాల మీదకు వచ్చి దాడిచేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



కోతుల దాడిలో మహిళ చేతికి గాయాలు

ఒక్క రోజులో పంట నాశనం



తెల్లవారిదంటే చాలు పొలంలో ఉండాల్సిందే. పొద్దుపోయేంత వరకు కంటికి రెప్పలా పొలాన్ని కాపాడుకోవాల్సి వస్తోంది. లేకుంటే కోతులు మొత్తం పీకి పందిరి వేస్తున్నాయి. అత్యవసర పని ఉండి బయటకు వెళ్లాను. కోతులు పొలంలో దాదాపు మొక్కలు లేకుండా పీకేశాయి. చాలా ఇబ్బందికర పరిస్థితి.

– మున్నంగి సాంబిరెడ్డి, ఉండవల్లి

మొక్కలు పీకేస్తున్నాయి



దాదాపు 20 ఏళ్లు భూములను సాగుచేస్తున్నా. ఎప్పుడు కూడా కోతులు మూకుమ్మడిగా దాడి చేసిన సందర్భాలు లేవు. ఇప్పుడు ఎక్కడి నుంచి వచ్చాయో, తెలియదు. పంటను నాశనం చేస్తున్నాయి. అడ్డుకున్న రైతులపైనా దాడి చేస్తున్నాయి. పొలం వైపు వెళ్లాలంటేనే భయపడే పరిస్థితులు ఉన్నాయి.

– తమ్మా నాగిరెడ్డి, ఉండవల్లి

మనుషులపై దాడి చేస్తున్నాయి



కోతులు గుంపులు గుంపులుగా వచ్చి ఇంట్లో ఉన్నవారిపై దాడి చేస్తున్నాయి. రోడ్లపై చిన్న పిల్లలు వెళుతుంటే వారిని కరుస్తున్నాయి. ప్రతిరోజు ఉండవల్లి సెంటర్ పిడబ్ల్యూడీ వర్క్‌షాపులో నుంచి పదుల సంఖ్యలో కోతులు వచ్చి ఒక ఇంటిపై నుంచి మరో ఇంటిపైకి దూకుతున్నాయి. దొరికినవి తీసుకెళ్లిపోతున్నాయి.

– సుబ్రహ్మణ్యం, ఉండవల్లి

ప్రజా దర్బార్‌కు వినతుల వెల్లువ



తాడేపల్లి రూరల్ : విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ఉండవల్లి అమరావతి కరకట్ట వెంబడి ఆయన నివాసంలో మంగళవారం ప్రజా దర్బార్ ఏర్పాటు చేశారు. రాష్ట్రం నలుమూలల నుంచి బాధితులు సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రాలను అందజేశారు. వాటిని పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని మంత్రి లోకేష్ వారికి హామీ ఇచ్చారు.

కుట్టు మిషన్లు పంపిణీ



మంగళగిరి (తాడేపల్లి రూరల్): మంగళగిరి నగర పరిధిలోని మహిళలకు స్త్రీశక్తి సంక్షేమం పేరుతో ఉచితంగా కుట్టు మిషన్లను మంగళవారం పంపిణీ చేశారు. టీడీపీ కార్యాలయంలో 80 మంది మహిళలకు మిషన్లతో పాటు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ స్త్రీశక్తి నియోజకవర్గంలోని పేద మహిళలకు నారా లోకేష్ ఉచితంగా కుట్టు మిషన్లు అందజేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు ఆరుద్ర భూలక్ష్మి, టీటీడీ బోర్డు మెంబర్ తమ్మిశెట్టి జానకీదేవి, రాష్ట్ర తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి ఆకుల జయసత్య తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ అమలుపై చేతులెత్తేసిన చంద్రబాబు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ

మంగళగిరి (తాడేపల్లి రూరల్) : సూపర్‌సిక్స్ అమలుపై ముఖ్యమంత్రి చంద్రబాబు చేతులెత్తేసారని, ఎన్నికల ముందు రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయాల్సిందేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ అన్నారు. మంగళగిరి నగర పరిధిలోని సీపీఐ కార్యాలయం వద్ద మంగళవారం రావుల శివారెడ్డి విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ మాట్లాడుతూ సూపర్ సిక్స్ అమలుపై రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేదంటూ, ఆర్థిక పరిస్థితి మెరుగుపడిన తర్వాత పథకాలు అమలు చేస్తానంటూ చంద్రబాబు మరోసారి మోసానికి తెరతీశారన్నారు. ఎన్నికల సమయంలో రాష్ట్రం అప్పుల్లో ఉందని, అప్పులున్నా హామీలు అమలు చేస్తానంటూ హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఇప్పుడు ఒక్కసారిగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేదని చెప్పి సంక్షేమ పథకాలను అమలు చేయలేమని చెప్పడం దారుణమన్నారు. ఎన్నికల ముందు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దిగజారిపోయిందని మాట్లాడిన చంద్రబాబు వాగ్దానాలు ఇచ్చేటప్పుడు ఎందుకు గుర్తుకురాలేదని విమర్శించారు. ఎన్ని ఇబ్బందులు ఉన్నా ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. రావుల శివారెడ్డి విగ్రహాన్ని సీపీఐ సీనియర్ నాయకులు ఈడ్పుగంటి నాగేశ్వరరావు ఆవిష్కరించారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, సీపీఎం నాయకులు జేవీ రాఘవులు, జవహర్‌లాల్, యస్‌యస్ చెంగయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు మునగాల మల్లేశ్వరరావు, సీపీఐ జాతీయ నాయకురాలు అక్కినేని వనిజ తదితరులు పాల్గొన్నారు.



రావుల శివారెడ్డి విగ్రహావిష్కరణలో పాల్గొన్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

గంజాయి మత్తులో యువకుడి హల్‌చల్



నడిరోడ్డుపై కూర్చుని వాహనాలకు అడ్డుపడుతున్న హరీష్



కారు ఆపి బెదిరిస్తూ.. డబ్బులు వసూలు

- ఒంటిపై కత్తితో పొడుచుకున్న వైనం
- కారులో ఉన్న మహిళపై దాడి
- పెట్రోల్ బంక్ తగలబెడతానంటూ హల్‌చల్
- నడిరోడ్డుపై గంటసేపు హైడ్రామా

తాడేపల్లి రూరల్ : గంజాయి మత్తులో ఓ యువకుడు హల్‌చల్ చేశాడు. మంగళగిరి ప్రకాశం బ్యారేజ్ పాత జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి భార్యతో గొడవపడి నులకపేట భారత్ పెట్రోల్ బంక్ ఎదురుగా చేతిలో కత్తిపట్టుకుని చేతులు, పీక కోసుకుంటూ భయానక వాతావరణం సృష్టించాడు. వచ్చిపోయే వాహనాలను ఆపుతూ, బెదిరించి డబ్బులు వసూలు చేస్తూ అడ్డు వచ్చిన వారిని కొడుతూ హైడ్రామా నడిపించాడు. అనంతరం పోలీసులు వచ్చి ఆ యువకుడిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లే ప్రయత్నం చేయగా వారిపై తిరగబడి... అనంతరం కాళ్లు పట్టుకుని బతిమిలాడాడు. సేకరించిన వివరాల ప్రకారం.. విజయవాడ కండ్రికకు చెందిన గాజుల హరీష్, రేవతి భార్యభర్తలు. హరీష్ కొంతకాలం క్రితం నులకపేట మసీదు సెంటర్‌లో ఇల్లు అద్దెకు తీసుకుని ఆటో తోలుతున్నాడు. సాయంత్రం భార్య రేవతితో గొడవపడి ఉరి వేసుకుంటానంటూ తాడు తీసుకు వచ్చి బెదిరింపులకు పాల్పడ్డాడు. పిల్లల్ని, రేవతిని చంపుతానన‌డంతో భయభ్రాంతులకు గురైన భార్య రేవతి పాత జాతీయ రహదారి వెంబడి ఉన్న భారత్ పెట్రోల్ బంక్ వద్ద ఉన్న తండ్రి ఆంజనేయులు ఇంటికి వచ్చింది. ఇక్కడికి వచ్చి గంజాయితో పాటు మద్యం సేవించి మరోసారి భార్య రేవతిని బయటకు లాక్కొచ్చి రోడ్డుపై రాళ్లతో గాయపరిచాడు. స్థానికులు హరీష్‌ను అడ్డుకునేందుకు ప్రయత్నించగా తన వెంట తెచ్చుకున్న కత్తితో ఒంటిపై గాయాలు పెట్టుకున్నాడు. అనంతరం భారత్ పెట్రోల్ బంకు వద్దకు వెళ్లి బంకు తగలబెడతానని హల్‌చల్ చేయడంతో పెట్రోల్ బంకు యాజమాన్యం, లారీ యజమానులు అడ్డుకున్నారు. అనంతరం రోడ్డుపైకి వచ్చి మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ లారీ ఆఫీస్ తగలబెడతాను, అద్దాలు పగలకొడతాను అంటూ రాళ్లు తీసుకోవడంతో హరీష్ కుటుంబ సభ్యులు అడ్డుకోవడంతో భార్య రేవతిని రాళ్లతో కొట్టడంతో ఆమె స్పృహ కోల్పోయింది. రోడ్డుమీదకు వచ్చి ఒక కారును ఆపి కారులో కూర్చుని వున్న మహిళపై దాడిచేయడంతో ఆ మహిళ చేతిలో ఉన్న చిన్నారి కారులో పడిపోయింది. వారు భయపడి డబ్బులు ఇచ్చి అక్కడి నుండి వెళ్లిపోయారు. అలా వచ్చిన ప్రతి కారుని ఆపడంతో వారు సైతం డబ్బులు ఇవ్వడం గమనార్హం. స్థానికులు తాడేపల్లి పోలీసులకు జరుగుతున్న ఘటనపై సమాచారం ఇవ్వడంతో పోలీసులు అతడి వద్ద ఉన్న కత్తిని తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించేందుకు ప్రయత్నించారు. వారిపై కూడా దాడికి పాల్పడ్డాడు. చివరకు పోలీసులు తమదైనశైలిలో హరీష్‌కు ట్రీట్‌మెంట్ ఇచ్చారు. అప్పుడు గానీ పోలీసుల దారికి అతను రాలేదు. తీవ్రంగా గాయాలు అవడంతో వివరాలు తీసుకుని విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి హరీష్‌ను తరలించారు.

అసిస్టెంట్ సిటీ ప్లానర్‌కు ప్రశంసాపత్రం

మంగళగిరి (తాడేపల్లి రూరల్) : గుంటూరులో జరిగిన 76వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి చేతుల మీదుగా మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ ఏసీపీ (అసిస్టెంట్ సిటీ ప్లానర్) అంజనా జేమ్స్ ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్‌బాషా, డిప్యూటీ కమిషనర్ శకుంతల, డీసీపీ అశోక్, టౌన్ ప్లానింగ్ అధికారులు అభినందనలు తెలిపారు.



నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లి రూరల్ : మంగళగిరి పట్టణ పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ డీఈ సురేష్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు కొప్పురావు కాలనీ, బాప్టిస్ట్ పేట ప్రాంతాల్లో విద్యుత్ లేన్ల అత్యవసర మరమ్మత్తులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు.

ఎల్‌సీడీసీ సర్వేను పరిశీలించిన సెంట్రల్ మానిటరింగ్ బృందం



గుంటూరు మెడికల్: జిల్లాలో జరుగుతున్న ఎల్‌సీడీసీ సర్వే పరిశీలనకు ఎల్‌సీడీసీ సెంట్రల్ మానిటరింగ్ బృందం మంగళవారం దుగ్గిరాల మండలంలోని ఈమని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించినట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి తెలిపారు. బృందంలో తమిళనాడు చెంగల్పట్టు జిల్లా నుంచి డెప్యూటీ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ డాక్టర్ ఎ.ఆర్.రంగనాథ్, మెడికల్ కన్సల్టెంట్ నేషనల్ లెప్రసీ ఇరాడికేషన్ ప్రోగ్రాం డాక్టర్ అక్షత్ పురోహిత్ చెన్నై నుంచి వచ్చినట్లు తెలిపారు. డాక్టర్ రంగనాథ్ మాట్లాడుతూ జిల్లాలో జరుగుతున్న ఎల్‌సీడీసీ సర్వే యాక్టివిటీస్ సంతృప్తికరంగా ఉందని చెప్పారు. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో కుష్టు వ్యాధిగ్రస్తుల గురించి తీసుకుంటున్న చర్యలను పరిశీలించారు. డాక్టర్ అక్షత్ పురోహిత్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ఇంటింటి సర్వే చేస్తున్న బృంద సభ్యులు ఖచ్చితమైన సమాచారం రాబట్టాలన్నారు. కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించడంలో తగిన పరిజ్ఞానం, అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లాలో సర్వే యాక్టివిటీస్ ఫిబ్రవరి 2 వరకు నిర్వహిస్తున్నట్లు కుష్టు నియంత్రణ అధికారి డాక్టర్ దాసరి శ్రీనివాసులు తెలిపారు. డీఎంహెచ్ఓ కార్యాలయ చాంబర్‌లో జరిగిన సమీక్ష సమావేశంలో డాక్టర్ లక్ష్మానాయక్ భూక్య, డాక్టర్ వి.సోమలా నాయక్, ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ ఏ.శ్రావణ బాబు, డాక్టర్ రోహిణి రత్నశ్రీ, డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ రత్న మన్మోహన్, డాక్టర్ ప్రియదర్శిని, డాక్టర్ ప్రదీప్ జయకర్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

అధ్వానంగా రహదారి

మేడికొండూరు: మందపాడు గ్రామం నుంచి వెలవర్తిపాడు వెళ్లే రహదారి పరిస్థితి అధ్వానంగా ఉంది. ఏక్కడ చూసిన గోతులు ఏర్పడి రాళ్లు పైకి లేచి ఉన్నాయి. వర్షాలు పడినప్పుడు ఈ గోతుల్లో నీరు చేరి ప్రమాదాల బారిన పడుతున్నట్లు వాహనదారులు తెలిపారు. రైతులు తమ వ్యవసాయోత్పత్తులను సకాలంలో తీసుకవెళ్లలేని పరిస్థితి నెలకొందని చెబుతున్నారు. రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.



గోతులమయంగా మందపాడు - వెలవర్తిపాడు రహదారి

రెండు గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరాలు

ఫిరంగిపురం: మండలంలోని పొనుగుపాడు, గుండాలపాడు గ్రామాల్లో మంగళవారం పశు ఆరోగ్య శిబిరాలను నుదురుపాడు, ఫిరంగిపురం పశువైద్యశాలల ఆధ్వర్యంలో నిర్వహించారు. 24 దూడలకు నట్టల నివారణ మందులు వేసినట్లు పశు వైద్యాధికారి పీర్ అహ్మద్ తెలిపారు. 21 పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స అందించినట్లు తెలిపారు. కర్లపూడి రాఘవరావు, ధూళిపాళ్ల కృష్ణ, పచ్చ సుబ్బారావు, పశువైద్యసిబ్బంది పాల్గొన్నారు. గుండాలపాడు గ్రామంలో 223 జీవాలకు షీప్ ఫాక్స్ వ్యాక్సిన్ వేసినట్లు పశు వైద్యాధికారి తెలిపారు. 60 పశువులకు వైద్య పరీక్షలు, గర్భకోశ సంబంధిత పరీక్షలు మందులు అందజేశామన్నారు. సర్పంచ్ కాంద్రు దాసయ్య, ఎల్ఎస్‌వీ ఆర్, వినీల, సిబ్బంది పాల్గొన్నారు.



నట్టల నివారణ మందు వేస్తున్న పశువైద్యాధికారి పీర్ అహ్మద్

ఏసీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

తాడేపల్లి రూరల్: బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సీపీఎం తాడేపల్లి పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం దీక్షా శిబిరాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో ఏసీసీ కార్మికులకు తాను గెలిస్తే వారి సమస్యను పరిష్కరిస్తానని చెప్పిన మాట లోకేష్ నిలబెట్టుకోవాలని అన్నారు. సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు మాట్లాడుతూ కోర్టు ఆర్డర్‌లను ఏసీసీ భూముల వేలంపాట నియమ నిబంధనలను సంబంధిత యాజమాన్యం ఉల్లంఘించినా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమని అన్నారు. దీక్షలలో వేముల రోజులు, అల్లం విజయ, వేముల రమణమ్మ, లక్ష్మి కూర్చొనగా, సంఘీభావంగా కూరపాటి స్టీవెన్,ఏఎఫ్‌టియు నాయకులు కె. నారాయణ, బి. సూర్యప్రకాష్, డి. మాణిక్యాలరావు, పిచ్చయ్య, రమాదేవి, దుర్గా భవాని, శారద సాల్మన్‌లు పాల్గొన్నారు.



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న బూరుగ వెంకటేశ్వరరావు

చికిత్స పొందుతూ ఇద్దరి మృతి

తాడేపల్లి రూరల్ : తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదాలకు గురై చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తులు ఇద్దరు వేర్వేరు ప్రభుత్వ వైద్యశాలల్లో మంగళవారం మృతి చెందారు. తాడేపల్లి ఎస్ఐ శ్రీనివాసరావు వివరాల మేరకు..ఈ నెల 21న కుంచనపల్లి జాతీయ రహదారిపై వెంకటేశ్వరస్వామి గుడి వద్ద విజయవాడ నుంచి గుంటూరు వెళ్లే మార్గంలో రోడ్డు దాటుతున్న ఓ వ్యక్తిని లారీ ఢీకొట్టింది. ఆ వ్యక్తిని వైద్య నిమిత్తం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు. సెప్టెంబర్‌లో కొలనుకొండ వద్ద గుంటూరు నుంచి విజయవాడ వచ్చే రహదారిలో రోడ్డు దాటుతున్న వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఆ వ్యక్తి వయసు సుమారు 60 సంవత్సరాలు ఉంటాయి. గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎవరైనా ఈ మృతదేహాలను గుర్తిస్తే తాడేపల్లి పోలీసులను ఆశ్రయించాలని ఎస్ఐ శ్రీనివాసరావు కోరారు.



గుర్తుతెలియని మృతదేహాలు

పోలీసు లాంఛనాలతో కుమార్ అంత్యక్రియలు

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని విజ్ఞానపురానికి చెందిన, మంగళగిరి ఏఆర్ఎస్ఐగా 6వ బెటాలియన్‌లో ఎం.టి సెక్షన్‌లో ఉద్యోగం చేస్తున్న తెనాలి కుమార్(50) సోమవారం మృతి చెందారు. గుండె సంబంధిత అనారోగ్యానికి గురికావడంతో స్థానికంగా వైద్యశాలకు చికిత్స కోసం తరలించారు. చికిత్సపొందుతూ ఆయన మృతి చెందాడు. మృతదేహాన్ని మంగళవారం విజ్ఞానపురానికి తీసుకువచ్చారు. బెటాలియన్ డీఎస్పీ రవి, ఆర్ఎస్ఐలు, 80 మంది సిబ్బంది పోలీసు లాంఛనాలతో కుమార్‌కు గాలిలోకి తుపాకులతో మూడు రౌండ్లు కాల్చి గౌరవ వందనం చేశారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25447 (మంగళగిరి)
7075167541 (తాడికొండ)
Office mail : sakshigntadvt@gmail.com